క్లుప్తంగా

సమాజ సేవతోనే తృప్తి

కడప కల్చరల్ : మనిషికి సమాజ సేవలోనే ఆత్మ సంతృప్తి లభిస్తుందని లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య అధ్యక్షులు అనంతబొట్ల వెంకట సుబ్బయ్య అన్నారు. శనివారం క్లబ్ ఆధ్వర్యంలో లయన్ కంభం సంజీవరెడ్డి పర్యవేక్షణలో నగరంలోని పీవీఆర్ సంస్థ వద్ద అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్, ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, బోగాల కొండారెడ్డి, సంపత్‌కుమార్, రవి, జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



భోజనం వడ్డిస్తున్న నాగేంద్రప్రసాద్

కడప కోటిరెడ్డిసర్కిల్ : పేదల ఆకలి తీర్చే అన్నదానంతో అధిక పుణ్యఫలం లభిస్తుందని నీటి పారుదలశాఖ రిటైర్డ్ సూపరింటెండెంట్ ఎస్వీ నాగేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం నాగేంద్రప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని కడప నగర శివారులోని బృంద వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగేంద్రప్రసాద్ సతీమణి సత్యాదేవి, ఆశ్రమ నిర్వాహకులు బాలసుబ్బయ్య, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌డీపీ శిక్షణలో ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడు



సర్టిఫికెట్ అందుకుంటున్న డాక్టర్ ఆర్.నీలయ్య

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఆర్.నీలయ్య ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో పాల్గొని శిక్షణ పూర్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ కళాశాల కమిషనరేట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శిక్షణ సంస్థలో అక్టోబర్ 21 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులను ఎంట్రిపెన్యూర్‌లుగా తీర్చిదిద్దే అంశం, మార్కెటింగ్, ప్రత్యేక శిక్షణ తదితర అంశాలపై శిక్షణ పొందారు. ఈ సందర్భంగా ఆర్.నీలయ్య మాట్లాడుతూ విద్యార్థులను రానున్నరోజుల్లో గొప్ప ఎంట్రిపెన్యూర్‌లుగా తీర్చిదిద్దేందుకు ఈ శిక్షణ దోహదం చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.


విభజన హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

కడప రూరల్ : రాయలసీమ లాంటి వెనుకబడిన ప్రాంతాలకు సంబంధించి ఉమ్మడి రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలని అఖిల పక్ష నేతలు నారాయణ, సత్తార్, సీఆర్‌వీ ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం జనాభా లేని అమరావతి కేంద్రంగా అభివృద్ధి అంటూ రాజకీయాలు చేయడం ఎంతమాత్రం తగదన్నారు. రాయలసీమ లాంటి కరువు ప్రాంతాలను త్వరితగతిన అభివృద్ధి చేయాలన్నారు. అందులో భాగంగా కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నారు. 70 శాతం పూర్తయిన గాలేరు–నగరి, 80 శాతం పూర్తయిన తెలుగుంగ తదితర ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. విభజన హామీ ల అమలుకు తక్షణమే చర్యలు చేపట్టి ఈ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ, గుర్రప్ప పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రత.. డ్రైవర్ల బాధ్యత



ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనల కరపత్రాలు పంపిణీ చేస్తున్న ట్రాఫిక్ సీఐ జావీద్

కడప ఎడ్యుకేషన్ : ప్రయాణికులను భద్రంగా తీసుకెళ్లే బాధ్యత ఆటో డ్రైవర్లదేనని ట్రాఫిక్ సీఐ జావీద్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా శనివారం కడప ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద రాయల్ రషీద్ అసోసియేషన్ ఆధ్వరంలో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడ రాదని అన్నారు. అలాగే ఎక్కువ మంది ప్రయాణికులతో ప్రయాణం చెయ్యడం నేరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరీముల్లా, ట్రాఫిక్ పోలీసులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నెలవు ఆ జాతీయ రహదారి

- స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం ప్రధాన కారణం
- అర కిలోమీటరు మేర విస్తరణకు నోచుకోని రహదారి
- ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులు



ఊటుకూరు వద్ద రహదారిపై లేని స్పీడ్ బ్రేకర్లు



ప్రమాదాలకు నిలయంగా మారిన ప్రాంతం

కడప వైఎస్సార్ సర్కిల్ : కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారి ఊటుకూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగువ నుంచి అర కిలోమీటరు మేర రోడ్డు వెడల్పు లేకపోవడంతోపాటు.. ఎక్కడపడితే అక్కడ డివైడర్ల వద్ద లింకు రోడ్లను ఏర్పాటు చేయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి వాహనదారులు అతి వేగంగా వచ్చి డివైడర్ల వద్ద రహదారిని దాటుకుంటున్న సమయంలో.. వారిని ఢీకొనడంతో పలువురు మృత్యువాత పడడంతోపాటు మరికొంత మంది గాయాల పాలవుతున్నారు.

ఇవిగో ఉదాహరణలు

■ ఇటీవల ఊటుకూరు వద్ద డివైడర్ వద్ద ద్విచక్ర వాహనదారుడు రోడ్డు దాటుతుండగా ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి అతి వేగంగా కారు వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు.

■ అదేవిధంగా నెల రోజుల కిందట అదే రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొనడంతో వాహనదారుడు గాయాలతో బయటపడ్డాడు. దీంతోపాటు అనేక ప్రమాదాలు ఈ ప్రాంతంలో చోటుచేసుకుంటున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు.

■ ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి డివైడర్ల మధ్య వదిలిన రహదారులు ప్రమాదకరంగా మారుతున్నాయని, వాటిని అధికారులు మూసి వేయాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి



ఊటుకూరు వద్ద ఉన్న జాతీయ రహదారిపై ప్రతి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు అధిక స్పీడుతో రావడంతో అదుపు చేయలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయంగా సంబంధిత అధికారులు సత్వరమే స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

– శివారెడ్డి, వాహనదారుడు, పెండ్లిమర్రి మండలం

నివారణ చర్యలు చేపట్టాలి



జాతీయ రహదారి కావడంతో ఈ ప్రాంతంలో నిత్యం వాహనాల రాకపోకలు కొనసాగుతుంటాయి. ఫ్లైఓవర్ దిగువ భాగం మొదలుకొని ఊటుకూరు వరకు ఎక్కడా స్పీడ్ బ్రేకర్లు కానరావడం లేదు. ఈ కారణంగా ప్రమాదాలు తరుచూ చోటు చేసుకుంటున్నాయి. వాహనాల వేగాన్ని నియంత్రించడంతోపాటు ప్రమాదాల నివారణకు అధికారులు వెంటనే ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– పెద్దిరెడ్డి, వాహనదారుడు, కడప

నేడు పురస్కార ప్రదానోత్సవం

కడప కల్చరల్ : మహాకవియిత్రి మొల్ల సాహితీపీఠం, శ్రీ భాగ్యరత్న ఫౌండేషన్ సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కడప నగరంలోని పెన్షనర్స్ కార్యాలయంలో పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సంస్థల కార్యదర్శి గానుగపెంట మనోజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రంగస్థల నటులు, లఘుచిత్ర నట దర్శకులు ఏవీఎస్ రాజుకు ఈ సందర్భంగా నటకళా తపస్వి పురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపకులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు అధ్యక్షత వహిస్తారని, వైవీయూ పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ముఖ్య అతిథిగా, కడప బాలోత్సవం అధ్యక్షులు గోపాల్, ఏపీ అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య తదితరులు అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

నేడు తాత్విక చింతనపై సదస్సు

కడప కల్చరల్ : బుద్దిస్ట్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు భారతీయ తాత్విక చింతనపై సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు పిల్లా కుమారస్వామి, కార్యదర్శి లెనిన్‌ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత, పూర్వ శాసనమండలి సభ్యులు ఎంవీఎస్ శర్మ, రచయిత దాదా హయత్ హాజరవుతున్నారని, వీరు మధ్యయుగాల నాటి సనాతన ధర్మం వాటి పుట్టుక తాత్విక మూలాల పైన ఇస్లాం క్రైస్తవం సూఫీమతంలో వచ్చిన తాత్విక అంశాల పైన ప్రసంగిస్తారన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటే కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం, జేబీవీఎస్ ది ప్రిజర్వేర్ సేవా సమితి ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని స్పిరిట్ కాలేజ్ కరస్పాండెంట్ శ్రీకాంత్ కుమార్ అన్నారు. శనివారం నెహ్రూ యువ కేంద్రం, జేబీవీఎస్ ది ప్రిజర్వేర్ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో కడప స్థానిక స్పిరిట్స్ కాలేజీలో నిర్వహించిన అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా ఉపన్యాస పోటీలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతకు మొక్కలు పెంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన స్ప్రెడ్ స్మైల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ అమ్మపైన ఎంతైతే ప్రేమ చూపిస్తారో.. అంతటి ప్రేమతో ఒక మొక్క నాటి పెంచితే పర్యావరణం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేబీవీఎస్ ది ప్రిజర్వేర్ సేవా సమితి వ్యవస్థాపకులు అశోక్, స్పిరిట్స్ కళాశాల కాలేజ్ ప్రిన్సిపల్ రియాజుద్దీన్, సిబ్బంది జ్యోతి, వెంకట రమణ, సుబ్బారెడ్డి, రవికుమార్, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

‘ఇంటర్ పరీక్ష ఫీజు అధికంగా వసూలు’



ఆర్ఐవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం సమర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యం ఇంటర్ పరీక్ష ఫీజును నిబంధనలకు విరుద్ధంగా అధికంగా వసూలు చేస్తున్నారని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్ యాదవ్ అన్నారు. ఈ విషయమై శనివారం ఇంటర్ ప్రాంతీయ పరిపాలన అధికారి నల్లపరెడ్డికి వినతిపత్రం సమర్పించేందుకు వెళ్లారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో ఆర్ఐవో కార్యాలయ ఏవో సుబ్బారెడ్డికి ఇచ్చారు. అనంతరం శ్రీనాథ్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో కడప నగరం, బద్వేలు, జమ్మలమడుగు, మైదుకూరు, పులివెందుల ప్రాంతాల్లో అధికంగా వసూలు చేస్తున్నారన్నారు. ఎటువంటి రశీదు కూడా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఇవ్వడం లేదని అన్నారు. ఈ విషయమై విద్యార్థుల దగ్గరికి వెళ్లి విచారణ జరిపాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర ఉపాధ్యక్షుడు విగ్నేష్, నాయకులు మహేష్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగల అరెస్ట్



వెంకటసుబ్బయ్య



అమర్ రాజ్‌కుమార్

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లా కడప క్రైం పోలీస్‌స్టేషన్ అధికారులు, సిద్దవటం ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో తమ సిబ్బందితో.. తమ పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలలో సంచరిస్తున్న బద్వేలులో నివాసం వుంటున్న గుమ్మాల వెంకట సుబ్బయ్య, రాజంపేట మండలం అత్తిరాలకు చెందిన గొర్ల కుమార్ అలియాస్ అమర్ రాజ్‌లను శుక్రవారం అరెస్ట్ చేశారు. వీరు గతంలో పలు నేరాలకు పాల్పడుతూ వుండేవారు. వీరి వద్ద నుంచి రూ.6.72 లక్షల విలువైన 96 గ్రాముల బంగారు ఆభరణాలను, మోటార్ సైకిల్‌ను రికవరీ చేశారు. మొదటి నిందితుడు వెంకట సుబ్బయ్య పలు నేరాలతోపాటు, ఎర్రచందనం కేసులో పీడీ యాక్ట్‌పై జైలుకు వెళ్లి వచ్చాడు. రెండవ నిందితుడు గొర్ల కుమార్‌పై పలు జిల్లాలలో 25 దొంగతనాల కేసుల్లో నిందితుడిగా వున్నాడు. వీరిని అరెస్ట్ చేసి సిద్దవటం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారు.

దంతాల సంరక్షణలో జాగ్రత్తలు పాటించాలి



పిల్లలకు దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్ నారాయణరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : దంతాల పరిరక్షణలో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని రిమ్స్ దంత వైద్యులు డాక్టర్ కొప్పర్తి నారాయణరెడ్డి సూచించారు. శనివారం కడప అంగడివీధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ దంత వైద్యశాల రిమ్స్ వారి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన 130 మంది విద్యార్థులకు రిమ్స్ దంత వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్సలను అందించారు. అనంతరం డాక్టర్ కొప్పర్తి నారాయణరెడ్డి మాట్లాడుతూ తియ్యటి పదార్థాలను తిన్న వెంటనే దంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. ఉదయం లేవగానే, రాత్రి పడుకునే ముందు దంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా టూత్ బ్రష్‌లు, పేస్టు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దంత వైద్యులు సీహెచ్ కవిత, సీహెచ్ హేమలత, బి.దినేష్, సి.రాశి, డి.జయశ్రీ, డి.ఓం కాశేశ్వర్, బి.కిరీటి, సి.రవితేజలతోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, మాదవి, సుకుమారి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

కడప రూరల్ : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. నగరంలోని గాయత్రి టవర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత రూ.లక్ష చెల్లించి కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పార్టీ సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు గ్రామ, వార్డు, డివిజన్ స్థాయి నుంచి పార్టీని నిర్మాణం చేస్తూ ప్రజలకు సభ్యత్వం అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నేత క్రిసెంట్ జిలానీబాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు బహుమతుల ప్రదానం

కడప కల్చరల్ : మహాప్రవక్త మహమ్మద్ జీవిత విశేషాలపై ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన రాత పరీక్షలో విజేతలకు ఆదివారం బహుమతుల ప్రదానం చేస్తున్నామని కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఎఫ్ఎం ముక్తార్ అహ్మద్ తెలిపారు. ఉదయం కడప నగరం సబ్ జైల్ దగ్గర ఉన్న సైనిక్ నగర్‌లో గల మదరసా ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి పలు ప్రాంతాల నుంచి ప్రముఖులు హాజరవుతారని వివరించారు.

ప్రయాణికుడికి బ్యాగ్ అప్పగింత



బాధితుడికి బ్యాగ్ అప్పగిస్తున్న ట్రాఫిక్ సీఐ జావీద్

కడప అర్బన్ : స్థానిక శంకరాపురానికి చెందిన ఎ.నాగరాజు తనది ఆటోలో బ్యాగ్ పోయిందని కడప ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ డీకే జావీద్‌కు ఫిర్యాదు చేశాడు. బాధితుడు తాను ప్రయాణించిన ఆటో పీసీ నంబర్ చెప్పాడు. ఇటీవల జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కొత్తగా వచ్చిన పీసీ నంబర్ ద్వారా ఆటో డ్రైవర్‌ను గుర్తించి స్టేషన్‌కు రప్పించి బాధితునికి బ్యాగ్‌ను అప్పగించారు.

మామపై అల్లుడు దాడి

కడప అర్బన్ : కడప నగరంలోని జిల్లా కోర్టు ఆవరణ సమీపంలో వరకట్న వేధింపు కేసులో శనివారం వాయిదాకు వచ్చిన వారి మధ్య వాగ్వివాదం ఘర్షణకు దారి తీసింది. మామ, బావమరదిపై అల్లుడు దాడి చేశాడు. ఈ సంఘటనలో మామ గాయపడ్డాడు. బాధితులను పోలీసులు చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి వుంది. పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఏర్పాటవుతున్న టపాసుల దుకాణాలు

- నగరంలో రెండు వేదికలు
- దాదాపు 100 షాపులు



మున్సిపల్ మైదానంలో కొనసాగుతున్న షెడ్ల నిర్మాణం

కడప కల్చరల్ : కడప నగరంలో దీపావళి సందడి మొదలైంది. నాలుగు రోజుల్లో పండుగ రానుండటంతో.. వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎప్పటిలాగా స్థానిక మున్సిపల్ మైదానంలో దుకాణాల నిర్మాణం ఊపందుకుంది. దీంతోపాటు బిల్టప్ వద్ద కూడా దుకాణాల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికి దాదాపు 100 మందికి పైగా వ్యాపారులు దుకాణాల ఏర్పాటు కోసం రుసుం చెల్లించారని, మరో 100 మంది కూడా చెల్లించే అవకాశం ఉందని సమాచారం. అధికారులు తమకు అందిన దరఖాస్తులను వడపోసి డిప్ తీసి దుకాణాలను కేటాయించనున్నారు. ఈ సందర్భంగా అధికారులు వారికి ఇచ్చే రశీదును వ్యాపారులు హోల్‌సేలర్స్‌కు చూపించి స్టాకు తెచ్చుకుంటారు. ఆదివారం డిప్ ద్వారా దుకాణదారులకు నంబర్లు కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

తాత్కాలిక షెడ్లు

ప్రస్తుతానికి మున్సిపల్ మైదానంలో 65, బిల్టప్ వద్ద 35 దుకాణాల ఏర్పాటుకు తాత్కాలిక షెడ్లు నిర్మిస్తున్నారు. ఈ పనులు మంగళవారం వరకు కొనసాగే అవకాశం ఉంది. అదే రోజున టపాసులను దుకాణాలకు చేర్చి ప్రారంభించనున్నారు. అధికారుల సూచన మేరకు ప్రతి దుకాణం మధ్యన 8–10 అడుగుల దూరం ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ఈసారి మున్సిపల్ హైస్కూలు మైదానంలో ఏర్పాటు చేసిన ప్రాంతం విశాలంగా కనిపిస్తోంది. స్టేడియం గోడ వైపు ఉండిన రోడ్డును రాజేశ్వరిగుడి వద్ద మూసివేశారు. దీంతో రోడ్డును కూడా కలుపుకొని దుకాణాలు వేయడంతో మధ్యనున్న ప్రాంతం విశాలంగా ఉంది. కొనుగోలుదారులకు ఇబ్బందులు తప్పనున్నాయి.

ఆర్మీ ర్యాలీకి ఇబ్బంది లేకుండా చూడాలి



అధికారులతో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని మున్సిపల్ మైదానం, డీటీడీసీలో జరుగుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. ననివారం మున్సిపల్ మైదానం, నాగరాజుపేట, రవీంద్రనగర్, సెంట్రల్ జైలు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ర్యాలీ సమయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. ర్యాలీకి హాజరయ్యే వారికి మరుగుదొడ్లు, శుభ్రత విషయంలో రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నాగరాజుపేట రవి థియేటర్ వెనుక భాగంలో ప్రజల ఫిర్యాదు మేరకు ఇంజినీరింగ్ అధికారులతో పరిశీలనలు చేసి, ఆ ప్రాంతంలో డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. పెద్ద కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని శానిటేషన్ అధికారులకు ఆదేశించారు. సెంట్రల్ జైలు వద్ద పైపులైన్ లీకేజీ ఉన్న ప్రాంతంలో తక్షణమే మరమ్మతులు చేయించి, ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. రవీంద్ర నగర్ 6వ డివిజన్ సచివాలయాన్ని తనిఖీ చేస్తూ, చిన్నారికి టీకా ఇంజెక్షన్ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకొని, వాటికి సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై వార్డు హెల్త్ సెక్రటరీపై ప్రత్యేక ఆఫీసర్ ద్వారా విచారణ చేయించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె. రాకేష్‌చంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ధనలక్ష్మి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాగింగ్ సంస్కృతికి చరమగీతం పాడాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైవీయూ రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్

వైవీయూ : ర్యాగింగ్ సంస్కృతికి చరమగీతం పాడి స్నేహపూరిత వాతావరణంలో చదువులు కొనసాగించాలని వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ అన్నారు. శనివారం విశ్వవిద్యాలయ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ రఘునాథరెడ్డి, ఆచార్య పద్మ ‘ర్యాగింగ్.. నేరం – ర్యాగింగ్ నిషేధం’ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై ఏపీ ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్ 1997 ప్రకారం శిక్షలు అమలు చేస్తారన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు దెబ్బతింటుందన్నారు. విశ్వవిద్యాలయం ప్రారంభం నుంచి ర్యాగింగ్ రహిత సరస్వతి నిలయంగా ఉందని, ఇదే విధానాన్ని కొనసాగిద్దామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె.ఎస్.వి కృష్ణారావు, జర్నలిజం శాఖ అధ్యాపకులు డాక్టర్ టి.సురేష్ బాబు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారం తగదు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రజలపై కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారం మోపడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీలు (ఎఫ్‌పీపీసీఏ) 2022– 23 సంవత్సరానికి సుమారు రూ.6072 కోట్ల భారం వేస్తూ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) నోటిఫికేషన్ జారీ చేయడాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 2022–23లో వాడిన కరెంటుకు ఈ నవంబర్ నెల నుంచి 2026 జనవరి వరకు యూనిట్‌కు దాదాపు రూ.0.83 అదనంగా చెల్లించాలని తాజా ఉత్తర్వు విద్యుత్ రెగ్యులేటర్ కమిషన్ ఇచ్చిందని తెలిపారు. ఏనాడో వాడుకున్న విద్యుత్తుకు ఆ తర్వాత కాలంలో అదనంగా వేసే సర్దుబాటు చార్జీల విధానాన్ని పూర్తిగా రద్దు చేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, ఎ.రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, దస్తగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిద్ర సుఖమెరుగదు!

‘ఆకలి రుచెరుగదు, నిద్ర సుఖమెరుగదు’ అనేది సామెత. బాగా ఆకలి వేస్తుంటే రుచి లేకున్నా తింటామని, అలసిపోయి నిద్రపోయేవారు సుఖవంత స్థలం గురించి ఆలోచించరని అర్థం. ఈ కోవలోనే కడప నగరంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడి అలసిసొలసిన ఓ కార్మికుడు డ్రైనేజీ కాలువపై ఉన్న గ్రిల్స్‌పై ఆదమరిచి నిద్రిస్తున్న దృశ్యం స్టేట్ గెస్ట్‌హౌస్ వద్ద కనిపించింది. సాధారణంగా డ్రైనేజీ పక్కన కొద్ది సేపు నిలుచొవాలంటేనే.. మనసుకు ఇబ్బందికరంగా అనిపిస్తుంది. అలాంటిది మురుగు కాలువపై నిద్రపోవాలంటే.. ఎంత అలసిపోయి ఉన్నాడో కదా..!

– మహమ్మద్ రఫీ, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్, కడప



